# అమరప్రేమ




- డా. కె.వి. గోవిందరావు

**రైలు కూతవేసి బయలుదేరగానే ప్లాట్‌ఫారమ్ మీద నిలచిన తండ్రిని మరోమారు చూసి కంఠాన్ని పెద్దది చేస్తూ "నేను వెళ్ళగానే నా పని ఏమైంది, ఉత్తరం రాస్తాను. వీలైనంతవరకు సోమవారానికి తిరిగి రావడానికే ప్రయత్నిస్తాను నాన్నా" అన్నది తండ్రి మీద మమకారంతో వత్సల.**

తండ్రి సమాధానంగా అన్న మాటలు ఆమెకు వినిపించలేదు కానీ, రైలు వంతెన దాటిపోయినా, ప్లాట్‌ఫారం మీద జనం చిందరవందరగా వున్న పూలగుత్తుల్లా కనిపిస్తున్నా, ఆమె మాత్రం కిటికీలోంచి తొంగి చూస్తూ అలానే కూర్చుంది.

ఆ పెట్టెలో కొద్దిమంది జనం వున్న విషయం ఆమె ఇప్పుడు గ్రహించింది. రైళ్ళలో స్థలం దొరకక తన్నుకు చచ్చే యీ రోజుల్లో అంత ఖాళీగా వుండడం ఆమెకు కొంత ఆశ్చర్యాన్ని కలిగించింది కూడా. ఆ పెట్టెలో ఆరుగురు పల్లెటూరి ఆడవాళ్ళు ఒక కర్రమీద వంగి వున్న ముసలివాడు, మధ్య వయస్కుడు, తన సరుకులవైపే దీక్షగా చూస్తున్న ఒక వర్తకుడు, ఆ తర్వాత - ఎదురు బెంచీలో మూలగా కిటికీలో తలపెట్టి నిద్రపోతున్న యువకుణ్ణి తన కళ్ళు చూడడంతోనే ఆమె కొంచెం చలించింది.

అంతకు క్రితం ఎన్నడూ ఆమె అందమైన యువకుణ్ణి చూడలేదు. అతను ధరించిన గుడ్డలు సామాన్యమైనవే ఐనా పరిశుభ్రంగా వున్నాయి. అందమైన ముఖం, గాలికి ఎగురుతున్న నల్లని వుంగరాల జుత్తు పొడవైన కనుబొమలూ అతనికి వన్నె తెచ్చాయి.

ఆమె అలాగే చూస్తూ తన తొలిగిన పమిటను సరిచేసుకోవడానికి కొంచెం కదిలింది. ఆమె అతని సౌందర్యానికి ముగ్ధురాలై అలా అతనివైపు చూడడం తెలివితక్కువని తెలుసుకున్నప్పుడు ముఖం మీద చిన్న నవ్వు తెర వెలిసింది.

అందమైనవాళ్ళు మురిసిపోవాలి కాని తను వికారి. ఆమెకు ఎంతోకాలం క్రితమే తెలుసు. తన పట్టణంలోని పరిచయులంతా వత్సల కురూపి అనీ, నల్లని అసహ్యమైన ముఖమనీ అనుకునే విషయం. తన అభ్యుదయానికి ముఖమే ప్రతిబంధకంగా నిలచిన విషయం వత్సల గ్రహింపగలిగింది.

ఆమె మొదటి విశ్వవిద్యాలయ పరీక్షలో ఉత్తీర్ణురాలైనప్పుడే తండ్రికి భారం లేకుండా యింకా కొన్ని సంవత్సరాలు కళాశాలలో గడప నిశ్చయించింది. ఆ తర్వాత తన శక్తివంచన లేకుండా ఏదైనా ఉద్యోగం కొరకు ప్రయత్నించింది.

ఆమె ఎలాంటి ఉద్యోగం చేయడానికైనా సిద్ధపడింది. కానీ తనను తీసుకొనకపోవడానికి కారణం అసహ్యమైన ముఖమేనని తెలుసుకుని బాధపడింది.

ప్రపంచంలో అన్ని మూలలా కురూపి అంటే ప్రజానీకమంతా అసహ్యించుకుంటుంది. కానీ అలాంటివారిలో ఎంత సున్నితమైన ఆదర్శాలున్నాయో, ఎంత వున్నతమైన ఆశయాలున్నాయో వారికనవసరం. భౌతిక సౌందర్యంతో మనస్తత్వాలనూ, సహృదయతను నిర్ధారణ చేయటం అవివేకం కదా!

ఆమె ఇప్పుడు మరో కొత్త ఉద్యోగ ప్రయత్నంలో పూనా వెళుతున్నా హృదయంలో ఆశకన్నా, అనుమానం, నిస్పృహ తాండవించాయి. ఆమె అర్జీ అంగీకరించాక యిప్పుడు ప్రత్యక్ష పరీక్షకు పిలువబడింది.

❄ ❄ ❄

మళ్ళీ ఆ యువకునివైపోమారు చూడాలన్న కుతూహలంకొద్దీ ధైర్యంగా వత్సల తల తిప్పింది. అతను తన కుడిచేతి వేళ్ళతో గాలికి చెదిరిన వుంగరాల జుత్తును సరిచేసుకుంటున్నాడు కానీ కళ్ళు మాత్రం తెరువలేదు.

ఈమారు వత్సల ఆశ్చర్యం మరీ అధికమైంది. అతని కళ్ళు కూడా శరీరం వలె ఎంత ఆకర్షణీయమైనవో చూడాలని ఉత్సాహపడింది. ఆమె గుండె కొంచెం వడిగా కొట్టుకుంది. అతనివైపే చూస్తూ కళ్ళప్పగించింది. అతను కళ్ళు అలానే మూసుకుని మామూలు మనిషిలా కదలడం వింత విషయమే. అతనేదో ధ్యానంలో మునిగి పోయాడనుకుంది వత్సల.

ప్రక్క స్టేషన్ రాబోతుండడం వలన రైలు వేగం తగ్గింది. ఇప్పుడైనా కళ్ళు తెరుస్తాడనుకుంది వత్సల. రైలు ఆగింది. ముసలివాడు మరికొందరు ప్రయాణీకులు దిగిపోయారు. మరి ఒకరిద్దరు కొత్తగా ఎక్కారు. రైలు కూత వేసి కదిలింది. కానీ ఆ యువకుడు మాత్రం కళ్ళు తెరువలేదు.

వత్సలకు కొంచెం అనుమానం కలిగి శ్రద్ధగా

అతని కనురెప్పల వైపు చూసింది.

అవును. ఆమె వూహించింది నిజమే. ఆ యువకుడు గుడ్డివాడు.

ఆమె హృదయం దయతో, అభిమానంతో చలించింది. అంత చక్కని యువకుని సౌందర్యం, గుడ్డితనంతో కళంకితం కావడం విచారింపదగ్గ విషయం. ఒక మారుగా ఆమె హృదయంలో అతని మీద సానుభూతి తలెత్తింది. కానీ అది స్వార్థమో, పరార్థమో చెప్పడం కష్టం.

మొదటిసారి అతన్ని కంపార్టుమెంటులో చూసినప్పుడే ఎంతో అందంగా వున్నాడనుకుంది. ఈమారు అతన్ని మరోమారు పరికించి "పాపం అమాయకుడు" అనుకున్నది. అతనెవరో, ఎక్కడ నివసిస్తాడో, ఎలాంటి జీవితాన్ని గడిపాడో తెలుసుకోవాలని వత్సల కుతూహలపడింది. ఆమె మనసంతా అతన్ని గురించిన ఆలోచనలతో నిండిపోయింది.

మరో పది నిముషాలకల్లా నల్లని మేఘాలు కమ్ముకుని, వర్షం కొద్దికొద్దిగా ఆరంభమైంది.

వత్సల త్వరితంగా కిటికీ తలుపు వేసుకుంది.

ఆ యువకుని సమీపంలో వున్న కిటికీ తెరిచే వుండడంవల్ల చినుకులు లోపలకు రావడం ఆమె చూసింది. వెంటనే లేచి కిటికీ రెక్క క్రిందకు లాగింది.

ఆ యువకుడు ఆనందంతో వందనాలు అన్నాడు.

"మీరు కొంచెం ప్రక్కకు జరుగుతారా" ఆమె మెల్లిగా అందుకుంది, "రెక్క వేసినా సందులగుండా చినుకులు పడుతూనే వున్నాయి. పెట్టె ప్రక్కకు లాగనా?" అతడందుకు పిల్లవాడిలా అంగీకరించాడు. గుడ్డివాళ్ళు ప్రతివారికీ అనుకూలించడం సహజం అనుకుంది వత్సల.

ఆమె తన స్థలానికి వెళ్ళబోతుండగా అతనడిగాడు "మీరు ఎక్కడిదాకా వెళుతున్నారు?"

"పూనా వెళుతున్నా" వత్సల ఉత్సాహంగా అడిగింది, "మీరు ఏ వూరు దాకా?"

"బొంబాయి"

వత్సలకు ఇక మాట్లాడటానికి ఏమీ దొరకలేదు. అపరిచితునితో అంతకన్నా యింకేం మాట్లాడుతుంది?

"మరి మీతో ఎవరూ లేరేం?" ఆమె అంది.

"ఎప్పుడూ ఎవరో ఒకరు నాతో ఎలా వుంటారు?" అతను మెల్లిగా నవ్వాడు, "మీరజ్‌లో ఒక మిత్రుడు నన్ను రైలు ఎక్కించాడు. పూనాలో మరో మిత్రుడు కలుసుకుని, బొంబాయి వెళ్ళే రైలులో దింపుతాడు. అక్కడ మరొకరు వస్తారు."

"మరి త్రోవలో మీకేమైనా అవసరాలు వస్తే?" వత్సల ఈ మారు కొంటెగా ప్రశ్నించింది.

"అవును. అవసరాలు వుండొచ్చు. నా అదృష్టంవల్ల మీరు నాకిప్పుడు సహాయం చేసినట్లే ఎవరో ఒకరు దొరుకుతుంటారు" అతను ఉంగరాల జుత్తు నిమురుకున్నాడు.

వత్సలకు కొంచెం ఆలోచన కలిగింది. ఆ యువకుడు తనకెంతో బాధాకరమైన విషయాన్ని తేలిగ్గా తీసుకున్నాడు. పైగా ఆనందిస్తున్నాడు కూడా. అది మాత్రం ఆమెను సంతోషపెట్టలేదు. పైగా అతని చిరునవ్వు వెనుకదాగి వున్న ఆకర్షణ తన్ను బంధించింది.

మళ్ళీ ఆమె ప్రశ్నించింది, "మీరు ఎప్పుడూ బొంబాయిలోనే వుంటారా?"

అతను ఏమీ సమాధానం యివ్వలేదు. అతను ప్రత్యేకంగా ఆమె కంఠ మార్దవాన్ని గ్రహిస్తుండడం వలన ఆ ప్రశ్న అతనిని ఆకర్షించలేదు. వత్సల మాత్రం అతనా ప్రశ్నకు సమాధానం యివ్వదలచుకోలేదని నిశ్చయించుకుంది.

మరి కొంచెం ఆగి ఆతనే "మీరు మీ స్థలానికి వెళ్ళారా?" అని అడిగాడు.

ఈ ప్రశ్న వత్సలను ఆశ్చర్యపరిచింది. తను వెళ్ళిన విషయం అతనికెలా తెలుసో? కానీ వెంటనే గుడ్డివాళ్ళు, కదలిక, శబ్దమూ సులభంగా గ్రహిస్తారన్న విషయం గుర్తు తెచ్చుకుంది. ప్రకృతి యొక్క హెచ్చు తగ్గులు సరిచేయగల శక్తిని ఆమె ఆలోచిస్తున్నప్పుడు, "మిమ్ములను రైలులో దిగబెట్టి వెళ్ళడానికి వచ్చింది. మీ నాన్నగారనుకుంటాను" అన్న అతని ప్రశ్న వత్సలకు మరీ కలవరపరిచింది.

'అవును. ఆ వచ్చింది మా నాన్నే' అంది వత్సల కొంచెం ఆశ్చర్యంతో. ఆమె తండ్రితో పూనా ఉద్యోగం విషయం చెప్పేటప్పుడు అతను శ్రద్ధగా విన్నాడు. అతను వాళ్ళ సంభాషణకన్నా ఆమె పలుకుల సొగసుకు ముగ్ధుడై ఆలకించాడు.

సంధ్యవేళకల్లా వర్షం కొంచెం తగ్గింది. మేఘాలు కమ్ముకొని వుండడం వల్ల అప్పటికే చీకటిగా వుంది. వత్సల కిటికీ నుంచి చూసింది. ప్రకృతి అంతా శాంతి ఆవరించి వున్నట్లు ఆమెకు గోచరించింది. అలాంటప్పుడే సంగీతం పుట్టింది. అప్పుడే మానవుడు వూహింపలేని విషయాలను ఆనందింపగల్గుతాడు. ప్రేమ వ్యాధి దహించిన హృదయానికి కూడా వూరట కలిగించేది అలాంటి సందర్భాలే.

వత్సల సన్నని గొంతుతో పాడడం ప్రారంభించింది.

ఆమె పాట ఆపి అతని వైపు చూసింది. అతను ఆనందంతో మెల్లిగా నవ్వుకుంటూ "పాట ఆపారేం? ఆ తర్వాత పాట పాడండి, చాలా బాగుంది" అన్నాడు.

ఆమె మళ్ళీ పాడడం ప్రారంభించింది. అతను శ్రద్ధగా వింటున్న విషయం తెలియడం వల్ల, ఆమెకు వెనుక వున్న ఉత్సాహం స్వాతంత్ర్యం ఈమారు లేకపోయాయి. వత్సల పాట ఆపి, తన కొద్ది సంగీత పరిచయానికి క్షమాపణ కోరింది.

"ఎన్ని చెప్పినా?" అతను నిశ్చింతగా అన్నాడు "మీరు ఎంత బాగా పాడేదీ నేను అర్థం చేసుకోగలను."

ఆమె ఈమారు చిరునవ్వు నవ్వి వూరుకుంది. అతనొక చిన్న పుస్తకం తీసి చూపుతూ అడిగాడు. "మీరు నన్ను జ్ఞాపకం వుంచుకోకపోయినా యిందులో మీ పేరు, చిరునామా రాయండి" ఈ విజిటింగ్ కార్డు మీ వద్ద వుంచండి."


వత్సల తన చిరునామా రాసి అందిస్తూ విజిటింగ్ కార్డు చూసింది. అందులో "విశ్వనాథ్ కె. పండిట్, గోల్డ్ వాయిస్ గ్రామఫోన్ కంపెనీ, బొంబాయి" అని వుంది.

పూనా స్టేషన్‌లో ఎవరో వచ్చి అతన్ని తీసుకు వెళ్ళారు. వెళ్ళేటప్పుడు, తనను గుర్తుంచుకోమని వత్సలను కోరాడు. స్టేషన్ నుంచి త్రోవ పొడుగునా అతన్ని గురించే ఆలోచింపసాగింది. తన్ను గురించి అతనేవిధంగా భావించాడోనని ఆమె భయం. అతనిని మరోమారు కలుసుకునే అవకాశం వుండదు కనుక అతనేమనుకున్నా పరవాలేదనుకుని వత్సల తృప్తి పడింది.

ఆ తర్వాత ఆమె వూహలన్నీ ఉద్యోగ విషయంలో నిమగ్నమయ్యాయి.

ప్రత్యక్ష పరీక్షలో వత్సలకు ఉద్యోగం రాలేదు. ఆమె ముఖం ఉద్యోగాన్ని మరో యువతికి వచ్చేటట్లు చేసింది. నిరాశతో, అభిమానంతో ఆమె చాలా దుఃఖించింది. కానీ ఉద్యోగం దొరికేవరకూ ఇంటికి వెళ్ళి తండ్రిని కష్టపెట్టకుండా వుండటానికి మాత్రం ఆమె నిశ్చయించుకుంది.

(మిగతా 30 వ పేజీలో చూడండి)





## సస్వర వేదమంత్రాలు

**శ్రీరామకృష్ణమఠం వారి ప్రచురణ**

**560 పేజీలు, వెల రూ. 110/-**

ప్రణవనాదమైన ఓంకారం ముఖచిత్రంగా, సర్వోపనిషత్తుల నుండి, ఘనపాఠమంత్రాలు, సామవేద మంత్రాలు, అధర్వణ వేద మంత్రాలు, శ్రీరుద్రప్రశ్న, చమకప్రశ్న, అరుణప్రశ్న, శివ మంత్రాలు, సూక్తాలను చక్కని తెలుగులో ప్రచురించారు. ఉచ్చారణా విధానం కూడా తెలుపుతూ శ్లోకాలను తెలుగులో ప్రచురించడం చక్కని ప్రయత్నం.

ముఖ్యంగా శాంతిమంత్రాలు, వివిధ ఉపనిషత్తులు గల ముఖ్య మంత్రాలను, మృత్యుంజయ మహామంత్రం, రుద్రనమస్కారం, చమక ప్రశ్న, పురుషసూక్తం, శివ పంచాక్షరీ మంత్రం, గాయత్రీ మంత్రం, ఇలా అన్ని ముఖ్యమైన వేదమంత్రాలను సేకరించి "సస్వర వేద మంత్రాలు" పేరుతో ప్రచురించారు.




అన్ని వర్గాల సాధకులకు, వేదాభిమానులకు, పురోహితులకు, వేద పండితులకు అందరికీ ఉపయుక్తంగా ఉండే ఈ పుస్తకం, ప్రతి ఇంటా ఉండదగినదే.

**- నారాయణ. జె.**



# అమర ప్రేమ కథ

(27వ పేజీ తరువాయి)

ఇంటికి తిరిగి రమ్మని తండ్రి ఎన్నో ఉత్తరాలు రాశాడు. కానీ ఆమె వెళ్ళలేదు. తనకు ఉద్యోగం దొరకలేదు. తన నిశ్చయానికి వ్యతిరేకంగా అనుసరింపదలచుకోలేదు.

ఒకనాడు ఆమెకు ఇంటినుంచి ఒక జాబు వచ్చింది. ఆమె వెంటనే తనకు రైలులో కలిసిన మిత్రుని నుంచి వచ్చిన ఉత్తరాన్ని తండ్రి తనకు తిప్పి పంపాడని గ్రహించింది. ఉత్తరం తీసి చదివింది.

ఆ ఉత్తరం తుదంటా చదివి వత్సల ఆనందంలో మునిగిపోయింది. ఆమె ఎన్నడూ తనకు రైలులో పరిచయమైన అతని నుంచి అలాంటి ఉత్తరం వస్తుందని కలలోనైనా భావించలేదు. జాబు ప్రారంభంలోనే కొద్ది పరిచయాన్ని పురస్కరించుకొని రాస్తున్నందుకు క్షమాపణ కోరాడు. ఆ మాటల పొందిక, అతని ఆశయాలు ఎంతో సున్నితంగా వున్నాయి.

తను నమ్మలేని విషయాలు ఆ లేఖలో వున్నాయి. తమ కంపెనీవాళ్ళు కొత్తగా రికార్డింగు ప్రారంభిస్తారుట. అందుకు తన పాటలు కూడా రికార్డు చేయడానికి బొంబాయి రమ్మని మరీ మరీ కోరాడు. వత్సలకామాట పెద్ద ఆలోచనకు తావిచ్చింది. ఎందరో సంగీతంలో ఆరితేరిన వాళ్ళుండగా తన్నే అతను కోరి ఆహ్వానించడం, విశ్వనాథ్‌కు తనపై ప్రత్యేకాభిమానం వుండడమే కారణమనుకుంది. తాము కొత్తవాండ్లకు కూడా అవకాశాన్నివ్వడానికి నిశ్చయించడంవల్ల తన్ను రమ్మని కోరుతున్నానని రాశాడు. అతనంత ఆప్యాయంగా రాసినప్పుడు పోకుండా వుండడం భావ్యమనిపించలేదు. పైగా తాము తన నుంచి రికార్డు చేయబోయే పాటలకు పారితోషికం పదివేలని రాశాడు. తనవంటి అభాగిని అంత డబ్బు సంపాదింపగలగడం వత్సల నమ్మలేక పోయింది. కానీ అతనంత అభిమానంతో రాసినప్పుడు తన పరిస్థితులను బట్టి వత్సలకు పోక తప్పింది కాదు.

❋ ❋ ❋

కొన్ని దినాలు తర్వాత ఆమె పాటలు రికార్డు చేయడం పూర్తి అయింది. వత్సల పారితోషికాన్ని అందుకునేటప్పుడు తన కళ్ళను తనే నమ్మలేకపోయింది. ఎంతో ఆనందంగా తీసుకుంది. కానీ తన పని అయిపోగానే తిరిగి వెళ్ళిపోవలసిన విషయం గుర్తు తెచ్చుకుని నిరాశ చెందింది. తను ఆ ప్రదేశాన్ని వదలటానికి యిష్ట పడలేదు.

విశ్వనాథ్ సుస్తీగా వున్న విషయం వత్సలకు తెలుసు. అందుచేతే ఆమె అతన్ని వదిలి వెళ్ళలేకపోయింది. ఆమె అక్కడే రెండు వారాలు గడిపి అతన్ని బాగా పరిచయం చేసుకుంది. అతను ఆమెపట్ల ఎంతో దయ చూపాడు. ఆమె పాటలు రికార్డు చేయడంలో కూడా అతను ప్రత్యేకంగా ఎంతో శ్రద్ధ చూపాడు.

రికార్డింగు పూర్తయిన మరుసటి దినం అతనికి జ్వరం వచ్చింది. ఆ నాలుగు రోజుల్లో విపరీతంగా పెరిగింది. అతని మంచాన్ని వదిలి పోవడానికి ఆమె మనసెంతో నొచ్చుకునేది. కానీ అప్పుడప్పుడూ కళ్ళు లేని అతనికి తను చేస్తున్న సహాయం సబబు కాదేమోననిపించింది.

అతను అప్పుడప్పుడూ తన వూహలు, ఆదర్శాలూ వెలికితెచ్చే కొన్ని మాటలు చెప్పేవాడు. వాటితోనే ఆమె మనస్సు తీవ్రంగా విచారించేది. ఆమె అనుకునేది, తను అందంగా వుంటానని అతను వూహించటం సహజమేనని. అలాంటి అమాయకుణ్ణి మోసగించటం తను తప్పు త్రోవ త్రొక్కడమేననుకుంది. తన్ను కాని అతను నిజంగా కళ్ళతో చూసి వుంటే అంత గాఢంగా ప్రేమించేవాడా? అన్న ప్రశ్న ఆమెకు ములుకులా తగిలింది. అలాంటి ఆలోచనలతోనే వత్సల దుఃఖంతో మునిగిపోయేది.

ఒకసారి ఆమె అశ్రువులు అతని చేతి మీద రాలాయి. అతను కంపించిపోయి అడిగాడు "వత్సలా! నీవు ఏడుస్తున్నావా?"

"లేదు" ఆమె ధైర్యంగా అబద్ధమాడింది.

అతను ఆమె కంటి నీరు తుడుస్తూ అన్నాడు "పిచ్చిదానా అలా దుఃఖిస్తే ప్రయోజనమేమిటి?"

అతని చేతిని నిమురుతూ "మీరు నా యెడల ఎంతో దయ, ఆదరమూ చూపారు. మీకు నేను కృతజ్ఞురాలిని" అంది ఆమె.

అతను మెల్లిగా నవ్వి వూరుకున్నాడు.

ఆమె ఏదో చెప్పరాని ఆవేదన అనుభవిస్తోంది. అతనికి చెప్పకుండానే ఒక చీటీ రాసి వెళ్ళిపోదామనుకుంది ఒక మారు. కానీ తనకెంతో దయ చూపిన అతన్నలా చేయడం న్యాయం కాదని విరమించుకుంది.

ఒక దినం అతని గదికి వెళ్ళింది. ఆమె పాదాల చప్పుడు విని "నువ్వేనా వత్సలా?" అన్నాడు. ఆమె కోసం ఎదురు చూస్తున్న ఆతృత ఆ మాటలో వ్యక్తమయింది. విశ్వనాథ్ జ్వరం క్రమంగా తగ్గిపోయింది. అందువల్ల అతను వత్సలను కూడా మరుసటి దినం నుంచి స్టూడియోకి రమ్మని కోరాడు. వత్సల కొంచెం విస్తుపోయి, "నేను వచ్చిన పని పూర్తయింది. నేను పదివేలు సంపాదిస్తానని మా నాన్న ఎన్నడూ అనుకోలేదు. కనుక నేను యింటికి వెళ్ళిపోతాను" అంది ఆమె.

ఆమె సంభాషణలో తన నిజమైన ఆశయాలు వెలికి తేకుండా దాచడానికి ప్రయత్నించింది. ఆమె ఆ విధంగా మాట్లాడడం తన్ను పరీక్షించడానికేనని విశ్వనాథ్ సులభంగా గ్రహించాడు.

అతను "వత్సలా"అని పిలిచాడు మనసారా. ఆమె అతని సమీపంగా జరిగి కూర్చుంది.

అతనామె మృదువైన చెక్కిళ్ళను నిమిరాడు.

"నా మీద దయ లేదా వత్సలా? నేను నిన్ను ఎంత గాఢంగా ప్రేమిస్తున్నానో నీకు తెలియదా? నీవు నా ప్రేమను స్వీకరించి ఎన్నడూ విడిపోవనుకున్నాను. నా కోరిక కూల తోస్తావా?"

"విశ్వనాథ్ నా మాట విను" ఆమె తన నిశ్చయాన్నంతా ఒకమారు స్మృతికి తెచ్చుకుంది. మీకు నా మీద భ్రాంతి వుంది. మీ కోరిక అంగీకరించడానికి మీకు నా కృతజ్ఞత చూపవలసి వుంది. నేను కూడా మిమ్ము మనసారా ప్రేమించాను. కానీ మీరు నన్ను అపార్థం చేసుకున్నారు.

"అదేమిటో అర్థం చేసుకోలేకపోతున్నాను వత్సలా?"

"మీరనుకున్నట్లు నా పాటలో వున్న మార్దవం నా శరీరంలో లేదు. ప్రజలంతా నన్ను అసహ్యించుకుంటారు. అలాంటి కురూపిని మీరు అర్థిస్తున్నారు." ఆ మాటలు విశ్వనాథ్‌ను ఏమీ బాధింపలేదు. పైగా అతను ఆమె తెలివితక్కువకు నవ్వుకున్నాడు కూడా.

ఆమెను మరీ దగ్గరకు లాక్కుని చెప్పాడు. "నా మాట విను. భౌతిక సౌందర్యం కండ్లతో చూడగలవారికి, చిన్నతనంలో కండ్లు పోయిన నేను కళ్ళు వున్నవారికన్నా ఎక్కువ స్థాయిలో సౌందర్యాన్వేషణ చేయగలను. అందరకూ అతీతమైన ప్రపంచంలోని ప్రేమతత్వాన్ని నేను ఆనందింపగలుగుతున్నాను. నీ హృదయం యొక్క మృదుత్వాన్నీ మాధుర్యాన్నీ అర్థం చేసుకున్నాను. నీవు కురూపివని నాకు ఎన్నడో తెలుసు. కానీ ఒక మాట, మనది మనసుల ప్రేమగాని, శరీరాల ప్రేమ కాదు. ఏం వత్సలా నన్ను వదలి వెళతావా?"

ఆమె ఏమీ మాట్లాడలేకపోయింది.

అతనామెను తన రెండు చేతులలోకీ తీసుకొని హృదయానికి హత్తుకున్నాడు.

వత్సల కండ్ల నుంచి రాలిన అశ్రువులు అతని వక్షం మీద పడ్డాయి. విశ్వనాథ్ ఆమె శిరోజాలను ముద్దాడాడు. ❋

## సదా దశ మార్చిన అపరిచితుడు

'వెళ్లవయ్యా వెళ్ళు' అంటూ జయం సినిమాతో తెలుగు తెరమీదకు దూసుకొచ్చిన సదా ఆ తర్వాత ఆ చిత్ర రేంజ్ హిట్ సాధించలేకపోయింది. అచ్చు తెలుగింటి ఆడపడచులా ఉందన్న కామెంట్లయితే వినిపించాయి గానీ తెలుగు నిర్మాతలు అంతగా అవకాశాలు మాత్రం ఇవ్వలేకపోయారు. దాంతో సదా తమిళ తెర మీద కెక్కికూర్చుంది. అక్కడ అడపాదడపా సినిమాలు బాగానే చేతికి చిక్కుతున్నాయి. విక్రమ్ హీరోగా నటించిన అపరిచితుడులో సదా గ్లామర్‌గా కనిపించింది. ఆ చిత్రం విజయం సాధించడంతో సదాకి అటు తమిళం, ఇటు తెలుగు రెండు చోట్లా అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయట.